## ప్రజా సమస్యలపై పోరాడే వారిని గెలిపించండి




సిపిఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ శెట్టి

**ఆత్మకూర్ నవంబర్ 30,ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రజా సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారాన్ని కనుగొనే వారిని గెలిపించాలని సిపిఐ నాయకులు సి.లక్ష్మీనారాయణ శెట్టి, శ్రీహరి తదితరులు విజ్ఞప్తి చేశారు.ఆదివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని సిపిఐకార్యాలయంలో జరిగిన సిపిఐమండల పార్టీ కార్యకర్తల సమావే శంలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గత రెండు సంవత్స రాలుగా గ్రామ పరిపాలనా అధికారులు లేకపోవడం చేత అభివృద్ధి కొంటుపడిపోయిందని మక్తల్ నియోజకవర్గం లోని ఆత్మకూరు ఉమ్మడి మండలంలో సిపిఐ పార్టీ పేదల పక్షాన పోరాడి ప్రజా సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు చేసిందని వారు గుర్తు చేశారు. ఉమ్మడి ఆత్మకూరు మండలంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా మరియు వార్డు మెంబర్లుగా గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు సిపిఐ పోరాటాలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువైందని అందులో భాగంగానే భవిష్యత్తులో కూడా ప్రజల పక్షాన నిలబడే సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు తమ వంతు సహ కారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీతో సిపిఐ పొత్తు కొనసాగు తున్నప్పటికీ ఆత్మకూరు మండలంలో మాత్రం సిపిఐ ఒంటరిగా మూడు సర్పంచులు మరియు 25 వార్డు సభ్యులకు తమ అభ్యర్థులను నిలబెడుతుందని ప్రజలు సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చింతల నరసింహ శెట్టి, బాలరాజు, లింగన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీతిమ్మప్ప స్వామి ధ్వజారోహణం

**మల్దకల్ నవంబర్ 30, ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ తిమ్మప్ప స్వామి ధ్వజారోహణం వేదమంత్రా లతో ఆగమ శాస్త్ర పద్ధతిలో నిర్వహించారు. దేవాలయ చైర్మన్ శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సకల దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు మధుసూద నాచారి రమేష్ రవి దిరేంద్ర దాస్ వాల్మీకి పూజారుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతానము కలుగని వారికి సంతానము కలిగేలా స్వామివారి ప్రసాదాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని తిలకించారు.

## మెగా వైద్యశిబిరంలో ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్

**భూత్పూర్,నవంబర్ 30,ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పట్టణంలోని పదోవార్డులో ఉన్న అంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం బీవీఆర్ హాస్పిటల్ అండ్ ఐవీఎఫ్‌ల సంయుక్త ఆధ్వ ర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు.పట్టణానికి చెందిన పలువురు వైద్య పరీక్షలు చేయించు కున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకు లు బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప,గడ్డం యాదయ్య(జగన్),మండల గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం యాదయ్య తదితరులు వైద్య పరీక్షలు చేయించు కున్నారు.ఈ కార్యక్రమంలో అఫ్రోజ్,కాంగ్రెస్ నాయకులు కెంద్యాల రాజేష్,మట్టి ఆనంద్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆస్తి రక్షణలో పోలీసులు చేసిన సేవ గొప్పది



పోగొట్టుకున్న బంగారు నగలు బాధితులకు అప్పగిస్తున్న పోలీసులు

**నారాయణ పేట, నవంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద లలితా భర్త కథలప్ప, కుంటిమద్రి గ్రామం కర్ణాటకకు చెందిన మహిళ మూడు మాసాల బంగారు నగలు పోగొట్టుకున్న విషయం స్థానిక పోలీసులకు తెలియజేశారు. దీనిపై వెంటనే స్పందించిన పేట ఎస్సై వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కానిస్టేబుల్ గోపాల్, రవి సీసీ కెమెరా దృశ్యాలను జాగ్రత్తగా పరిశీలించారు. ఆ దృశ్యాలలో మీనార్ టీ స్టాల్ వద్ద నగలు పడిపోవడం, తరువాత టీ తాగడానికి వచ్చిన వలస కూలీలు వాటినితీసుకువెళ్లడం గమనించారు.తక్షణమే చర్యలు తీసుకొని నగలను గుర్తించి బాధితురాలు లలితకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె పోలీసుల సేవ పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తి రక్షణలో చూపిన చురుకుదనానికి ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్సై వెంకటేశ్వర్లు అభినందించారు.ప్రజల భద్రత కోసం పోలీసుశాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో సీసీ కెమెరాల ఉపయోగం ఎంత ముఖ్యమో మరోసారి వెల్లడైంది.

## ముళ్ళ పొదల్లో నవజాత శిశువు లభ్యం

●కాపాడిన 108 సిబ్బంది



శిశువును కాపాడిన 108 సిబ్బంది

**నారాయణ పేట, నవంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి గ్రామ సమీపంలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని కాటన్ మిల్ల్ దగ్గర ముళ్ళపొదల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఒక ఆడబిడ్డను వదిలివెళ్లారు. శిశువు ఏడుపులు విని స్థానిక యువకులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే టెక్నీషియన్ శిరీష, పైలట్ రాములు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చిన్న గాయాలతో పాటు శ్వాస సమస్య ఉన్నట్లు గమనించిన 108 సిబ్బంది, అంబులెన్స్‌లోనే ఆక్సిజన్ అందిస్తూ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం శిశువును జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డా మహేందర్ పరీక్షించి ప్రస్తుతం శిశువు ఆరోగ్యం స్థిరంగా ఉందని తెలిపారు. ఈ సేవలో చురుకుదనంతో వ్యవహరించిన టెక్నీషియన్ శిరీష, పైలట్ రాములును స్థానికులు, జిల్లా ఆసుపత్రి వైద్యులు, అలాగే 108 సూపర్‌వైజర్ రాఘవేంద్ర అభినందించారు. ఇలాంటి మానవతా సేవలు సమాజంలో 108 అంబులెన్స్ సిబ్బంది పాత్ర ఎంత కీలకమో మరోసారి చాటిచెప్పాయి.

## గెలుపు దిశగా ప్రణాళిక రూపొందించాలి : మాజీ ఎమ్మెల్యే చిట్టెం

**మక్తల్ టౌన్, నవంబరు30 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నివాసంలో ఉమ్మడి మాగనూరు, కృష్ణ మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో సర్పంచ్ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థి గెలిపించడానికి శాయ శక్తుల కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు కూడా గ్రామాలలో తమ కార్యకర్తలకు ప్రతిరోజు సమావేశాలు నిర్వహించి గెలుపు దిశగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు.



## ఘనంగా పడమటి ఆంజనేయ స్వామి కోనేరు పునః ప్రారంభం

**మక్తల్ టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో పడమటి ఆంజనేయస్వామి కోనేరును పునర్ నిర్మించి రాష్ట్ర క్రీడా, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా ప్రారంభించారు. గతకొన్ని దశాబ్దాలుగా మరుగున పడి ఉన్న కోనేరును మంత్రి సొంత నిధులతో పున: నిర్మించారు. ఈ రోజు పునర్ నిర్మించిన కోనేరుకు పూజలు చేసి మంత్రి సతీ సమేతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పడమటి ఆంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల 2 నుండి ప్రారంభం కానున్నాయని తెలిపారు. వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వ హించనున్నామని తెలియజేశారు. గత పాలకుల నిరక్ష్యం వల్ల ఆంజనేయ స్వామి కోనేరు మరుగున పడిపోయిందన్నారు. ఈ కార్యక్రమం మక్తల్ పట్టణ పురోహితుల మంత్రోచ్చరణలతో పట్టణ వాసుల సమక్షంలో కోనేరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కొండయ్య, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ అధినేత గవినోళ్ల బాలకృష్ణ రెడ్డి,స్థానిక తహసీల్దార్ సతీశ్ కుమార్, కట్టా సురేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఏ.రవికుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, ఎండోమెంట్ అధికారి కవిత, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు



కోనేరు వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు



పడమటి ఆంజనేయ స్వామి కోనేరు

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



ముఖ్యమంత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సునీతరెడ్డి

**ఆత్మకూర్ నవంబర్ 30, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ని మొదల రేవంత్‌రెడ్డి సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మ కూరు పట్టణంలో పర్యటించిన నేపథ్యంలో ఆదివారం రోజు జిల్లా ఎస్పీ సునీతరెడ్డి ముఖ్యమంత్రి ఏర్పాట్లను సందర్శించి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి పర్యటన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పట్టణంలోని జాతర మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపార్కు ప్రత్యేకంగా సంద ర్శించి అనంతరం కృష్ణానదిపై కొత్త బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసే స్థలాన్ని మరియు పట్టణ శివారులో నూతనంగా నిర్మించాను అన్న 50 పడకల ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు కూకట్పల్లిగా ఏర్పాట్లు చేయాలని వీఐపీ మరియు ప్రజాప్రతినిధులకు పార్కింగ్ చేసే స్థలాలను ప్రత్యే కంగా పరిశీలించి పోలీసు అధికారులు కూకట్ బందీగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ వెంబడి అదనపు డిఎస్పి వీరారెడ్డి సంబంధిత పోలీసు అధికారులు జిల్లా అటవీ శాఖ అధికారి రాంరెడ్డి ఆత్మకూర్ కొత్తకోట వనపర్తి సిఐలు అమరచింత ఆత్మకూర్ పట్టణాలకు చెందిన ఎస్సైలు తదితరులు ఉన్నారు.

## ప్రకృతిలో పాఠాలు..మామిడి తోటలో విద్యార్థుల వనభోజనాలు



వనభోజన మహోత్సవంలో విద్యార్థులు

**మద్దూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** మద్దూరు షెడ్యూల్డ్ కులాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు, మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని బాలుర షెడ్యూల్డ్ వసతి గృహ విద్యార్థులకు వార్డెన్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించబడింది. మద్దూరు పట్టణ శివారులోని మామిడి తోటలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోజంతా ప్రకృతిని అనుభవిస్తూ, సహజ వాతావరణంలోనే నేర్చుకునే అవకాశాన్ని పొందారు. వార్డెన్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రకృతిలో లభించే వనరులను స్వయంగా గమనించడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానపిపాస పెంపొందుతుందని, చదువుతో పాటు అన్ని విభాగాలపై అవగాహన పెరగాలని సూచించారు. విద్యార్థులు స్వయం క్రమశిక్షణ, స్వయంకృషి, ప్రాక్టికల్ లైఫ్ స్కిల్స్ అలవర్చుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తోటలోనే విద్యార్థులు పర్యవేక్షణలో వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటూ, మధ్యాహ్న భోజనాన్ని కూడా సహజ వాతావరణంలోనే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఎస్సై జయరాంకు ఘన సన్మానం




ఎస్సై జయరాంను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి, నవంబరు 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, పోలీసుశాఖలో 36 సంవత్సరాల విశిష్ట సేవ అనంతరం పదవీ విరమణ పొందుతున్న పెబ్బేరు ఎస్సై 2 జయరాం ను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అంద జేశారు. కానిస్టేబుల్‌గా సేవా ప్రయాణం ప్రారంభించి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కర్తవ్యనిష్ఠ, శిస్తు, ప్రజా సేవాభావంతో నిర్విరామంగా పనిచేసిన జయరామ్ సేవలను ఎస్పీ హృదయపూర్వకంగా కొనియాడారు. అనేకమంది ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న ఆయన పోలీసు శాఖకు వదిలి వెళ్తున్న సేవా ముద్ర చిరస్మరణీయం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్సై జయరాం ది కేవలం 36 ఏళ్ల సేవ కాదు.. ప్రజా భద్రత, నిజాయితీ, కర్తవ్యనిరతికి నిలువెత్తు నిదర్శనం. జయరామ్ కుటుంబ సభ్యులకు కూడా పోలీసు కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 1989 సంవత్సరంలో పోలీసు వ్యవస్థలోకి కానిస్టేబుల్ గా అడుగుపెట్టి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తించి సర్వీస్ నందు 60 రివార్డులతో తన ప్రతిభను చాటుకున్నారు. తన సేవలకు మెచ్చిన ప్రభుత్వం 2000 సంవత్సరంలో సేవా పథకంతో గౌరవించింది. అంచలం చెలుగా 2017 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్, 2020 సంవత్సరంలో ఏఎస్ఐ, 2025 సంవత్సరంలో ఎస్సైగా పదోన్నతి పొందడం జరిగింది. ఉద్యోగం ప్రారంభం నుండి చురుకుగా ఉంటూ అధికారుల మన్ననలు పొందిన ఎస్సై జయరాం, సంఘ విద్రోహ శక్తులతో పోరాటంలో కీలక పాత్ర పోషించి జిల్లా ప్రశాంత వాతావరణంలో నెలకొల్పడానికి తనవంతు పాత్ర పోషించడం జరిగింది. రాబోయే జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతోగడపాలని ఎస్పీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, రిజర్వు ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి విద్యార్థులు

### అభినందించిన జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**పెబ్బేర్, నవంబరు 30 ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల చిట్యాల నందు నిర్వహించిన వనపర్తి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెబ్బేరు మండలం వై.శాఖపూర్ గ్రామంకు చెందిన హెల్త్ అండ్ హైజీనీ విభాగంలో( జూనియర్స్ )కుమారి“ జె. హర్షిత “పి. హర్షిత ప్రదర్శించి“సేవ్ లైఫ్ ఫ్రమ్ మాన్‌హోల్స్ “(సేవ్ లైఫ్ ఫర్ మాన్ హోల్స్ )ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ప్రాజెక్ట్ కు గైడ్ టీచర్ గా కె. రామచంద్రుడు వ్యవరించడం జరిగింది. మెమెంటో, సర్టిఫికెట్ ను కలెక్టర్ ఆదర్శ సురభి, డీఈవో అబ్దుల్ గని నుండి తీసుకోవడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు టి. మల్లికార్జున్,ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు హర్షిత, గైడ్ టీచర్ రామచంద్రుడుని అభినందించడం జరిగింది. ఆదర్శ సురభి, డీఈవో అబ్దుల్‌గని నుండి తీసుకోవడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు టి.మల్లికార్జున్,ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు హర్షితను, గైడ్ టీచర్ రామచంద్రుడుని అభినందించడం జరిగింది.

## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన ఎస్సైలు



నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్సైలు

**నారాయణ పేట, నవంబరు 30 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట టౌన్,రూరల్,మండలాల్లో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంలో ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాముడు ఆదివారం నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. అభ్యర్థులు, ప్రజలు నామినేషన్ దాఖలు కోసం వచ్చే సందర్భంగా కేంద్రాల వద్ద ఉండాల్సిన ప్రాథమిక సౌకర్యాలు, భద్రతా చర్యలు సక్రమంగా ఉన్నాయో లేదో అధికారులు పరిశీలించారు. అనంతరం సమస్యాత్మకంగా భావించబడుతున్న పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించి, పోలింగ్ రోజునఎటువంటి అంతరాయం లేకుండాఎన్నికలు శాంతియుతంగా జరగాలని అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులకు సూచనలుజారీ చేశారు. అధికారులుమాట్లాడుతూ, సమస్యాత్మక కేంద్రాల్లోఅదనపు బందోబస్తు, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఏర్పాటుచేయాలని సూచించారు.మొత్తం ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా సాగేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.నామినేషన్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసులకు స్పష్టమైన సూచనలు ఇచ్చి, ఎలాంటి అనవసర గుంపులు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పహారాను బలోపేతం చేసినట్లు తెలిపారు.

## మల్దకల్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన చిట్టెమ్మ



మల్దకల్ సర్పంచ్‌గా నామినేషన్ వేసిన చిట్టెమ్మ

**మల్దకల్ నవంబర్30, ప్రభాతవార్త:** మల్దకల్ మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ అయిన మల్దకల్ గ్రామపంచాయతీ గాను మొదటి నామినేషన్ ఉప్పరి చిట్టమ్మ భర్త ఉప్పరి గోపాల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చిట్టెమ్మ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో తనను భాగస్వామ్యం చేయాలని గ్రామఅభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భారీ జనసందోహం మధ్య నామినేషన్ దాఖలు చేయడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

## కంటి వైద్య శిబిరంలో 96 మంది పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణ పేట, నవంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయం సాధించింది. ఈ శిబిరాన్ని సక్షం స్వచ్ఛంద సంస్థ, శంకర కంటి ఆస్పత్రి హైదరాబాద్, ఫీనిక్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డా. జయచంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయడం అభినందనీయమని ప్రశంసించారు. కంటి చూపుతోనే జీవితంలో వెలుగు సాధ్యమని, ప్రతి ఒక్కరు కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా చూసుకోవాలని సూచించారు. శిబిరంలో మొత్తం 96 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా శస్త్ర చికిత్స అవసరమైన వారిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా గౌరవ అధ్యక్షులు డా.మదన్ మోహన్‌రెడ్డి, డా. ప్రసాద్ శెట్టి, డా.గగన్, సంస్థ ప్రధాన కార్యదర్శి కె.రాఘవేంద్ర గౌడ్, రాజశేఖర్, రాజశేఖర్‌గౌడ్ అలాగేశంకర ఆసుపత్రి, ఫీనిక్స్‌సంస్థ ప్రతినిధులు శివరంగ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

- గ్రామ పంచాయతీ ఎన్నికల ముగిసే వరకు ప్రజావాణి ఉండదు
- మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లా కలెక్టర్లు వెల్లడి

**మహబూబ్‌నగర్, నవంబరు30 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.

**గద్వాల టౌన్ నవంబర్30, ప్రభాతవార్త:** 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

**వనపర్తి, నవంబరు30 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి నేడొక ప్రకటనలోతెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు మెంబర్ఎన్నికలు పూర్తయి, కోడ్ ముగిసే వరకు ప్రజావాణికార్యక్రమం ఉండదని స్పష్టం చేశారు.ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు ఎవరూ రావొద్దని తెలిపారు.

## నామినేషన్ల స్వీకరణ



ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**అమరచింత నవంబర్30,ప్రభాతవార్త:** అమరచింత మండలంలో రెండో విడతలో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు ఆదివారం నుండి నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. మొదటిరోజు ఈర్లదిన్నె గ్రామంలో రెండు, కృష్ణం పల్లి గ్రామంలో రెండు, మిట్ట నందిమల్లగ్రామంలో2, పామిరెడ్డిపల్లెలో రెండు, చంద్రనాయక్ తాండాలో 3 మొత్తం 11 మంది నామినేషన్లు వేశారని అమరచింత ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

**నారాయణ పేట,నవంబరు30 ప్రభాతవార్త :** నారాయణపేటలో పట్టణ కేంద్రంలోని బిజెపి సీనియర్ నాయకులు నాగురావు నామాజీ ఇంటిలో ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్” కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందు, బీజేపీ నాయకుడు నామాజీ రవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలతో నేరుగా సంభాషించే వేదికగా మన్ కీ బాత్” కీలక పాత్ర పోషిస్తోందని అభిప్రాయపడ్డారు.దేశ అభివృద్ధి, సామాజిక అంశాలపై ప్రధాని పంచుకున్న సందేశాలు ప్రతి పౌరుడిని ప్రేరేపిస్తాయని అన్నారు. ప్రత్యేకంగా యువత, గ్రామీణ ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినడం ద్వారా దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సూచించారు.స్థానిక స్థాయిలో కూడా పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బిజెపి నాయకులు

## కంకర తేలి అధ్వానంగా మారిన పెద్దపూర్ రోడ్డు

### కంకర రోడ్డుపై పాదచారులు నడవలేని దుస్థితిలో ఉన్న రాజనగరం రోడ్డు



**ఉప్పునుంతల, నవంబరు 30 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల నుంచి రాజానగరం వెళ్లే రహదారి కంకర తేలి కనీసం పాదచారులు నడవడానికి వీల్లేకుండా ఉంది. ఈ మార్గం గుండా నిత్యం వ్యవసాయ పొలాలకు, పెద్దాపూర్, లక్ష్మాపూర్ గ్రామాలకు వెళ్లి ఈ మార్గం గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం దెబ్బతింది. రోడ్డు దెబ్బతిని గోతులు ఏర్పడి, కంకర తేలి కనీసం పాదచారులు నడవడానికి వీల్లేకుండా ఉంది. ఇటీవల అధికారులు వర్షాలలో దెబ్బతిన్న రోడ్ల కోసం నిధులు మంజూరు చేశారు.కానీ ఉప్పునుంతల నుంచి రాజనగరం మీద వెళ్లే రోడ్డు దెబ్బ తిందని అధికారులకు కానీ, నాయకులకు కనిపించడం లేదాఅని ఈ ప్రాంత రైతులు వాపోతు న్నారు.రద్దీగా వెళ్లి ఈ మార్గం దెబ్బ తినడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే కంకర తేరిన ఈ మార్గం పై మట్టి పోసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని పలు రైతులు కోరుతున్నారు.

### ఉడిపి స్వాముల ఆశీర్వాదం పేట ప్రజలకు ఆధ్యాత్మిక శక్తి అందిస్తుంది

**నారాయణ పేట, నవంబరు 30 ప్రభాతవార్త :** ఉడిపి శ్రీకృష్ణమటం మఠాధిపతి శ్రీ విశ్వంభర తీర్థ నారాయణపేటలో అనంతశయన మందిరంలో జరుగుతున్న ధార్మిక కార్యక్రమానికి విచ్చేశారు. ప్రపంచప్రఖ్యాత ఉడిపి శ్రీకృష్ణమటం మఠాధిపతి శ్రీ విశ్వంభర తీర్థ స్వాములవారు ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ కార్యకర్త కురుమన్న నివాసానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పుష్పమాలలు, శాలువాలతో స్వాములవారిని ఘనంగా సత్కరించారు. అనంతశయన మందిర ట్రస్ట్ సభ్యులు శ్రీపాద మరియు కురుమన్న స్వాములవారితో లోకాయపల్లి సంస్థానం, ఛత్రపతి శివాజీ మహారాజు చరిత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంపై విశేషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆశీర్వాదం పొందిన వారిలోపార్వతమ్మ, విజయలక్ష్మి రఘువీర్ యాదవ్, పుష్పలత రణధీర్ యాదవ్ దంపతులు, అక్షయ్ కుమార్ యాదవ్, దివ్య అభిషేక్ తదితర కుటుంబ సభ్యులు ఉన్నారు. అలాగే పల్లా రఘు,పరమేష్ శివ,ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ చంద్రకాంత్ యాదవ్ దంపతులు, బీజేఎమ్ నాయకుడు కమలాపురి శ్రీనివాస్ తదితర భక్తులు కూడా పాల్గొన్నారు. ఉడిపి స్వాముల ఆశీర్వాదం నారాయణపేట ప్రజలకు ఆధ్యాత్మిక శక్తి అందిస్తుందని భావిస్తున్నారు.

## మొదటి రోజు 06 సర్పంచ్, 10 వార్డ్ సభ్యులకు నామినేషన్లు



నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

**దేవరకద్ర, నవంబరు 30 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ రెండో విడత షురూ అయింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కౌకుంట్ల మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రి య ఆదివారం నామమాత్రంగా సాగింది. ఉదయం నుంచి మండలంలోనీ క్లస్టర్ కార్యాలయానికి అభ్యర్థులు తరలివచ్చి సందడి వాతావరణాన్ని నెలకొల్పారు. అధికారుల పర్యవేక్షణలో పారద ర్శకంగా నామినేషన్లు స్వీకరించగా కౌకుంట్ల మండల కేంద్రంలోని పుట్టపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పుట్ట వెంకట్ రాములు, తిమ్మన్న 02 నామినేషన్, ముచ్చింతల సర్పంచ్ అభ్యర్థిగా 01 నామి నేషన్, రేకంపల్లి సర్పంచ్ అభ్యర్థిగా 01 నామినేషన్, తిరుమలాపూర్ సర్పంచ్ అభ్యర్థిగా 01, ఇశ్రంపల్లి 01నామినేషన్లు క్లస్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా 10 వార్డు సభ్యులకు ముచ్చింతల 08, రేకులం పల్లి 02 నామినేషన్లు దాఖ లయ్యాయి. మొత్తం కలిపి మొదటి రోజు 06 సర్పంచ్, 10 వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పుట్టపల్లి కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శేరి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల రామ్ రెడ్డి, పుట్టపల్లి గ్రామ ప్రజలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం




**పెబ్బేర్, నవంబరు 30 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం వై శాఖపూర్ గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌కు నేషనల్ టీచర్ ఇన్స్పిరేషన్ అవార్డును ఆదివారం బిర్లా కాన్ఫరెన్స్ హాల్ బిర్లా ప్లానీ టోరియం హైదరాబాదులో అవార్డును ప్రధానం చేసి ఘనంగా సన్మానించడం జరిగింది. విద్యారంగంలో చేసిన కృషికి అవార్డును హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ తెలియజేశారు. జిల్లా పరిషత్ స్కూల్ ఉపాధ్యాయ బృందం, వైశకాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### ప్రారంభమైన రెండో దశ సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ

**దామరగిద్ద, నవంబరు30 ప్రభాతవార్త:** స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా దామరగిద్ద మండ లంలో సర్పంచ్ వార్డు సభ్యుల రెండో దశ నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు ఆదివారం మండలంలోని సర్పంచ్ స్థానాలకు 17, వార్డు సభ్యులకు 20 నామినేషన్లు వచ్చినట్లు మండల అభివృద్ధి అధికారినణి సాయిలక్ష్మి తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులుగా మొగల్ మడక గ్రామానికి సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ తరపున గత్ప రాములు, మల్రెడ్డిపల్లి గ్రామానికి సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున శ్వేత శివకుమార్ నామినేషన్ దాఖలు చేశారు.

### పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక



**దామరగిద్ద, నవంబరు 30 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల మండల పరిధిలోని మొగల్ మడ్కా గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలు నియోజక వర్గ ఇంచార్జి కుంభం శివ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

### సీఎం సభకు తరలిరావాలి

**నర్వ, నవంబరు 30 ప్రభాతవార్త:** మక్తల్‌లో నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు నర్వ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నేడు మక్తల్‌కు రానున్న నేపథ్యంలో ఆదివారం నర్వమండల కేంద్రంలో నిర్వహించిన సమా వేశంలో చెన్నయ్య సాగర్‌కాంగ్రెస్ పార్టీనాయకులు,కార్యకర్తలకు దిశానిర్దేశంచేశారు. మండలం లోని అన్నిగ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సభకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

### రాష్ట్రస్థాయి సైన్స్ పేయిర్‌కు ఎంపికైన ఉర్దూ మీడియం విద్యార్థిని ఇక్ర భాను

**శ్రీరంగాపూర్, నవంబరు 30 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలం జానంపేట గ్రామానికి చెందిన ఇక్ర భాను తండ్రి అబ్దుల్ ఖయ్యూం పెబ్బేరు మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం స్కూల్ నందు 9వ తరగతి చదువుతున్న ఇక్ర భాను వనపర్తి జిల్లా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని డిఈఈఓ అబ్దుల్ గని చేతుల మీదుగా ఆదివారం ప్రశంస పత్రం అందుకున్నది. త్వరలో హైదరాబాదులో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ పేరుకు ఎంపిక కావడం జరిగింది. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కు ఎంపికైనందుకు పాఠశాల ఉపాధ్యాయులు, జానంపేట ప్రజలు, గ్రామ ప్రజలు కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

# మొదలైన పల్లె పోరు

(మొదటి పేజీ తరువాయి)

139 సర్పంచి, 1138వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహించను న్నారు. ఇదేవిధంగా రెండో విడతలో ఆరు మండలాల్లో (హన్వాడ,సీసీకుంట,దేవరకద్ర,కోయిల్‌కొండ,కౌకుంట్ల,మిడ్జిల్)లల ో 151సర్పంచి,1334వార్డుల సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇదే విధంగా మూడో విడతలో ఐదు (అడ్డాకుల, మూసాపేట,భూత్పూర్,బాలానగర్, జడ్చర్ల)మండలాల్లో 133 సర్పంచి,1152 వార్డు సభ్యుల పదవు లకు ఎన్నిలు నిర్వహి స్తారు. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ గత నెల 26న నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలోగ్రామాల్లో సర్పంచు లు, వార్డు సభ్యుల పదవులనాశించే స్థానిక నాయకులు హల్‌చల్ చేస్తూ పదవుల కోసం ఆరాటపడుతున్నారు.స్థానిక ఎన్నికలకు సర్పంచులు,వార్డు సభ్యుల పదవులనిశించేవారు తమ పదవుల కోసం రిజర్వేషన్లు ఖరారు కావడంతో పదవులనాశించే స్థానిక నాయకులు తమ అధి నేతలతో పావులు కదుపుతున్నారు.ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రు.10లక్షల పోత్సాహకంఅందిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించిన నేపథ్యంలో వచ్చే నిధులతోతమ గ్రామాలను అబి వృద్ధి చేయవచ్చనే భావనతో ఆయా గ్రామాల్లో పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు స్థానిక నేతలు అవిరళ కృషి చేస్తున్నారు.

**మూడోవిడతలో భూత్పూర్ మండలంలో 19 జీపీలు, 174వార్డులకు ఎన్నికలు...**

జీపీ ఎన్నికలు భూత్పూర్ మండలంలోని 19గ్రామ పంచాయ తీలలో 174వార్డులకు మూడో విడత అంటే డిసెంబర్ 17న ఎన్నికలు నిర్వహించనున్నారు.ఇందులో 98వార్డులు జనరల్‌కు కాగా, 76వార్డులు వివిధ కేటగిరిలకు సంబంధించి మహిళలకు రిజర్వేషన్ కల్పించారు. 2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ,ఎస్టీల రిజర్వేషన్,2024 సామాజిక సర్వే ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.రిజర్వేషన్ల ప్రకారం 13స్థానాలు ఎస్టీ(మహిళ), 14స్థానాలు ఎస్టీ(జనరల్),12స్థానాలు ఎస్సీ(మహిళ),19స్థానాలు ఎసీ(జనరల్), 16స్థానాలు బీసీ(మహిళ),24స్థానాలుబీసీ (జనరల్)లకు కేటాయించారు. వీటితో పాటు అన్‌రిజర్వుడ్ (మహిళ)కు35వార్డులు,జనరల్‌కు 41 స్థానాలురిజర్వుఅయ్యాయి.

**19 సర్పంచుల పదవులకు ఎన్నికలు:** జనాభా ప్రాతిపదికన సర్పంచులు,వార్డు మెంబర్లు రిజర్వేన్లు ఖరారు కావడంతో ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆశావహులు తహతహలాడుతున్నారు. భూత్పూర్ మండలంలోని 19గ్రామపంచాయతీల సర్పంచులకు




వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించనున్నారు.భూత్పూర్ మండ లంలోరిజర్వేషన్లను ఒక్కసారి పరిశీలిస్తే తాటిపర్తి(జనరల్), కొత్తూరు(బీసీ–మహిళ),కరివెన(బీసీ–మహిళ), వెల్కిచర్ల (బీసీ–జనరల్), భట్టుపల్లి (ఓసీ–జనరల్),మద్దిగట (ఎస్సీ– జనరల్), కప్పెట(బీసీ–జనరల్), కొత్తమొల్గర(ఓసీ–జనరల్), పోతులమడుగు (ఓసీ–జనరల్),అన్నాసాగం(ఓసీ–జనరల్),రావులపల్లి (బీసీ–జనరల్),శేర్పల్లిహెచ్(ఎస్సీ–మహిళ), హస్నాపూర్(ఓసీ–జనరల్), తాటికొండ(ఓసీ–మహిళ),పాతమొల్గం (ఎస్సీ– జనరల్) ,పెద్ద తండా(ఎస్టీ–మహిళ),లంబడి కుంట తండా (ఎస్టీ–జనరల్),ఏవీఆర్ తండా(ఎస్టీ–జనరల్), చౌలతండా(జనరల్–మహిళ)కు రిజర్వు అయ్యాయి.దీంతో ఆయా స్థానాలలో తమ కు కేటాయించిన కోటాలో తమ అభ్యర్థిత్వాన్ని నిలిపేందుకు స్థానిక నాయకులు, ఆశావహులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యంగా సర్పంచు ఎన్ని కల్లో తమ సత్తా చాటేందుకు ఆయా పార్టీల అధినేతలు,స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు,ఎంపీలతో మంతనాలు సాగిస్తూ తమ ప్రాబల్యం చాటేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచు ఎన్నికలు పార్టీ గుర్తుల ప్రకారంగా కాకుండా పరోక్షంగా నిర్వహిస్తుడడంతో స్థానిక నాయకులు ప్రభావం ఈ స్థానిక ఎన్నికలలో ఉంటుందని భావిస్తున్నారు.ఏదేమైనా మరో నెలలో జరిగే సర్పంచు ఎన్నికలకు స్థానిక నాయకులు సన్నద్ధమౌతు న్నారని చెప్పక తప్పదు.రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సర్పంచులు, వార్డు సభ్యులకు అధికార పార్టీ నుంచే అధిక స్పర్ధ ఉండవచ్చుని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.రానున్న పక్షం రోజుల్లో జీపీ ఉత్కంఠకు తెరపడనుంది.

## నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలి

### ఎన్నికల పరిశీలకులు కాత్యాయని దేవి



లాల్‌కోట నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

**చిన్న చింతకుంట, నవంబరు 30 ప్రభాతవార్త :** సర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు చూడాలని ఎన్నికల పరిశీలకులు కాత్యాయని దేవి ఆదేశించారు. ఆదివారం లాల్ కోట నామినేషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని ఆమె సూచించారు. సర్పంచు, వార్డులకు పోటీ చేసే అభ్యర్థులు ఫారం3 లతో పాటు అన్ని అంశాలను పూర్తి చేసి ఆయా పత్రాల ను జతపరిచి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేయాలని ఆమె సూచించారు. రెండవ దశ ఎన్నికలలో భాగంగాసర్పంచ్ వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. లాల్ కోట నామినేషన్ కేంద్రంలో సర్పంచ్‌కు రెండు నామినేషన్లు, ఒక వార్డుకు నామినేషన్, వడ్డేమాన్ నామినేషన్ కేంద్రంలో సర్పంచ్ కు 7 నామినేషన్లు, ఒక వార్డుకు నామినేషన్, చిన్న చింతకుంట నామినేషన్ కేంద్రంలో మూడు నామినేషన్లు, ఒక్క వార్డుకు నామినేషన్, అమ్మాపూర్ నామినేషన్ కేంద్రంలో సర్పంచు పోటికై ఐదు నామినేషన్లు, వార్డు లకు పోటికై 12 నామినేషన్లు రావడం జరిగిందని అధికారులు తెలిపారు. మొదటిరోజు సర్పంచ్ పోటీకి 17,వార్డులకు పోటీకై 15 నామినేషన్లు రావడం జరిగిందని తహసిల్దారు ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మీ నర్సింలు తెలిపారు.

## నర్వలో వంద శాతం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు గెలవాలి

**నర్వ, నవంబరు 30 ప్రభాతవార్త:** నర్వ మండలంలోని 19 గ్రామపంచాయతీలో 100% కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లే గెలవాల ని ప్రతి ఒక్కరూ కష్టపడి అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్య క్షుడు బీసం చెన్నయ్య సాగర్,సీనియర్ నాయకులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి సూచించారు. ఆదివారం నర్వ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలందర్ రెడ్డి నివాసంలో మండ లంలోని కాంగ్రెస్ పార్టీ ఆయా గ్రామాల ముఖ్య నాయకుల సమా వేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు మండలంతో పాటు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోని గ్రామాలలో100% కాంగ్రెస్ పార్టీ సర్పంచులే గెలవాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమిష్టి కృషితో పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలోమక్తల్ నియోజకవర్గ



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, హాజరైన పార్టీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, నర్వ మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కిసాన్ సెల్, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.3 కోట్లు హాంఫట్..

- ■బురిడీ కొట్టించిన దొంగ బాబా
- ■లబోదిబో అంటున్న బాధితులు

**పెబ్బేర్, నవంబరు 30 ప్రభాతవార్త :** ఆరోగ్యం బాగు చేయాలని తనను ఆశ్రయించిన దంపతులను క్షుద్రపూజల పేరుతో భయపెట్టి ఏకంగా రూ.3.50 కోట్లు కొట్టేశాడో నకిలీ దొంగ బాబా. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆదోని మండలం బైచిగేరిలో చోటు చేసుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవట్లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో బాధితులు గోడు వెళ్లబో సుకున్నారు. తెలంగాణలోని వనపర్తి జిల్లా పెబ్బేరులో భాగ్యలక్ష్మి హోటల్ నిర్వాహకులు వెంకటయ్య,పద్మ దంపతులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బైచిగేరి గ్రామానికి చెందిన దుర్గాసింగ్ కు దేవుడు వస్తాడని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం కుదుట పడుతుందని ఎవరో చెబితే కొన్ని రోజుల కిందట దంపతులు అక్కడికి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసు కున్న దుర్గాసింగ్ వారికి కట్టుకథలు చెప్పారు. మీ పొలంలో నిధి ఉందని, అది తీసేంత వరకూమీకు,మీ పిల్లలకు ప్రాణహాని ఉంటుందని భయ పెట్టాడు. ఆ నిధి తీస్తానని చెప్పి వారి నుంచి రూ.80 లక్షలు కాజేశాడు. ఓ రోజు రాత్రి బాధితుల స్వగ్రామమైన ఉండవల్లి శివారులోని వారి పొలంలో క్షుద్రపూజలు చేశాడు. అనంతరం ఇక్కడ అమ్మ వారి విగ్రహం బయటపడిందని చెప్పి మూడడుగుల ఎత్తున్న విగ్రహాన్ని దంపతులకు చూపించాడు. ఈ విగ్రహాన్ని ఇంట్లో పెట్టుకుంటే ప్రాణహాని ఉంటుందని,అమ్మేస్తే రూ.కోట్లు వస్తాయని నమ్మబలి కాడు. అమ్మవారి విగ్రహం కొనుగోలుకు కొందరు



అమ్మవారి విగ్రహాన్ని చూయిస్తున్న బాధితుడు



బాబా జవలగేరి దుర్గాసింగ్(ఫైల్)



వార్త ప్రతినిధికి సమాచారం అందిస్తున్న బాధితుడు వెంకటయ్య



క్షుద్ర పూజలకు ఉపయోగించిన పూజా సామాగ్రి

ఢిల్లీకి వచ్చారని చెప్పి,ఐదు సార్లు బాధితులను ఢిల్లీకి తీసుకెళ్లాడు. వీరినుంచి సుమారు రూ.3.కోట్లు వసూలు చేశాడు. చివరికి మోసపోయామని గ్రహించిన దంపతులు తమ డబ్బు తిరిగి వ్వాలని దుర్గాసింగ్‌ను కోరారు. దాంతో అతడు బెదిరింపులకు దిగాడు. గ్రామంలోకి అడుగు పెడితే చంపేస్తామని దుర్గాసింగ్ తో పాటు ముకుంద అనే వ్యక్తి మమ్మల్ని బెదిరించారు. ఆదోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోవట్లేదని గత నెల ఆదోనికి వచ్చి డీఎస్పీతో పాటు తాలూకా పోలీసు సీఐకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని దంపతులు ఎమ్మెల్యే వద్ద తమ బాధ చెప్పుకున్నామని ఎమ్మెల్యే తమకు సానుకూలంగా స్పందించి డిఎస్పీతో మాట్లాడి కేసు నమోదు చేసి విచారించడానికి ఆదేశాలు ఇచ్చారని బాధితులు ఆదివారం రోజు వార్తా ప్రతినిధికి స్వయంగా పెబ్బేర్ పట్టణంలో సమాచారం ఇచ్చారు.

## తెలంగాణకు వాళ్ళే విలన్లు

(మొదటి పేజీ తరువాయి)

పదిసార్లు ఆలోచించి మాట్లాడాలని, ప్రజలకు ఆలోచన శక్తి ఉందని ఎవరు ఏం మాట్లాడినా దాని ఇంకా ఉన్న అర్థం ఏందో ప్రజలకు తెలుసని అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ఊహించని విధంగా భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు మినాజ్, కాంగ్రెస్ నాయకులు దాల్ ఖాజా, అశోక్ యాదవ్, మాలిక్ షాకీర్, సర్వరాజ్ ఆసిఫ్, సుల్తాన్ కింగ్, ఖాజా ఉన్నారు.

## ప్రజాస్వామ్య మనుగడకు మీడియా పాత్ర కీలకం

(మొదటి పేజీ తరువాయి)

గౌరవం పెరుగుతుందన్నారు. సోషల్ మీడియా విస్తృతమైనప్పటికీ నిజాలను రాసే వారికే విలువ ఉంటుందని పేర్కొన్నారు. జోగు లాంబ గద్వాల జిల్లా ప్రజలు ఎంతో చైతన్యవంతులని, ఇక్కడి జర్నలిస్టులు సైతం ప్రజలకు మేలు చేసే వార్తా కథనాలు రాస్తూ బాధ్యతాయుతంగా పనిచేయడం సంతోషకరమన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల హక్కులు కాపాడేందుకు, ఐక్యతగా ఉండేందుకు తమ సంఘం ఎన్నో ఏళ్లుగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వం అర్హులైన వారికేఅక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల వెల్ఫేర్ కమిటీలను పునరుద్ధరించాలని కోరారు. ఈ మహాసభల్లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామ్‌నారాయణ, మధుగౌడ్, శ్యామ్, బాల స్వామి, కన్నయ్య, ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

### ఎన్నికల ఖర్చుకు బ్యాంకు ఖాతా తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాన్ని ఆమె సందర్శించి, కేంద్రంలో రైతుల సౌకర్యార్థం చేప ట్టిన ఏర్పాట్లను పరిశీలించి, తేమ శాతం రాగానే ఆలస్యం చేయ కుండా కొనుగోళ్ళుప్రారంభించాలని ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మండల అధికారులు ఉన్నారు.

## నేడు మక్తల్‌కు ముఖ్యమంత్రి రాక



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మక్తల్ టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు మక్తల్‌కు విచ్చేయనున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పత్రికా సమావేశం నిర్వహించి పశు సంవర్ధక,పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్య క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి మక్తల్‌లో కట్టుదిట్టమైన సభ ఏర్పాట్లు చేశారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులంతా భారీ ఎత్తుగా తరలిరావాలని అన్నారు. మక్తల్ నారాయణపేట, కొడం గల్ ఎత్తిపోతల పథకం పనులకు భూమిపూజకు ఏర్పాట్లు చేశారు. నారాయణపేట వరకు నాలుగు లైన్ల బిటి రోడ్డు రూ. 210 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం భూమిపూజ చేయనున్నారు. ఆయా పనులకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంపైలాన్ ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ అధ్యక్షులు ఏ.రవికుమార్,మాజీ జెడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ రవి కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గాయత్రి అనిల్, బికెఆర్ ఫౌండేషన్ అధినేత గవినోళ్ల బాలకృష్ణరెడ్డి, కట్టాసురేష్ కుమార్ గుప్త,శివరాంరెడ్డి పాల్గొన్నారు.

### తొలిరోజే నామినేషన్ల వెల్లువ

**ధన్వాడ, నవంబరు30 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతోనే ధన్వాడ మండలంలో ఎన్నికల సందడి మొదలైంది. తొలి రోజే నామినేషన్ కేంద్రాలు ప్రజలు, అభ్యర్థుల తో కిక్కిరిశాయి. మండలంలోని 20 పంచాయతీలకు గాను నామి నేషన్ ప్రక్రియ చురుగ్గా సాగింది. సర్పంచ్ పదవికి 14 మంది అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియతో ఎన్నికల హీట్ పెరిగింది. అలాగే 182 వార్డులకు గాను 9 మంది వార్డ్‌మెంబర్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అధికారుల పర్యవేక్షణ లో క్యూలైన్‌లు, బారికేడింగ్, సహాయక డెస్కులు అందుబాటులో ఉండడంతో నామినేషన్ ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగానే పూర్తయింది. మొదటి రోజే ఇంత స్పందన రావడం, ప్రజల్లో ఎన్నికలపై ఉన్న ఆసక్తికి నిదర్శనమని అధికారు లు అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో మరింత పోటీ పెరిగే అవకాశం ఉన్నట్లు వారు అంచనా వేస్తున్నారు.

### బెల్ట్ షాప్‌పై దాడి : కేసు నమోదు

**ఇటిక్యాల నవంబర్30, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మున గాల గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఓ బెల్ట్ షాపుపై ఆదివారం ఎస్. ఐ.కే.రవి నాయక్ ఆధ్వ ర్యంలో దాడులు నిర్వహించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మునగాల గ్రామంలో ఓ వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం అముతున్న సమాచారంతో యస్ఐరవి నాయక్ పోలీస్ సిబ్బందితో కలసి దాడి నిర్వహించగా బెల్ట్ షాప్ లో 5.1 లీటర్ల మద్యం లభించగా ఈ మద్యం విలువ సుమారు 5 వేల 610 రూపాయల విలువ ఉంటుందని దీంతో యజమాని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే రవి నాయక్ తెలిపారు

### మొదటి రోజు నామమాత్రపు దరఖాస్తులు

**బిజినేపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త:** సర్పంచ్ ఎన్నికలకు సంబ ంధించి నామినేషన్ల ప్రక్రియ ఆదివారం మొదటి రోజు కావడంతో మందకొడిగా కొనసాగింది. ఉదయం 10 గంటల నుంచే నామి నేషన్ల స్వీకరణ కేంద్రాలవద్ద సందడి నామమాత్రంగా కనిపించింది. సర్పంచ్, వార్డు సభ్యుల కోసం వేర్వేరుగా నామినేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు క్యూలైన్ల లో అభ్యర్థులు కనిపించారు. మొదటి రోజు సర్పంచ్ అభ్యర్థిత్వానికి 16, వార్డు సభ్యులకు 15 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో కథలప్ప తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకూ అభ్యర్థులు నామినేషన్ కేంద్రాల వద్ద వేచి ఉన్నారు. 5 గంటల వరకు వచ్చిన వారినిలోపలికి పంపించి గేట్లు మూసివేశారు. నామినేషన్ పత్రాలతో పాటు ప్రత్యేక బ్యాంకుఖాతాలు,కుల ధ్రువీ కరణ పత్రాలు సమర్పించని అభ్యర్థులు నామినేషన్ల పరిశీలన సమ యానికివాటిని అందజేయవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.



మహాదేవుని పేట గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బాలపీరు

